# సింప్లీ సత్యంగారు! లేక....

## సత్యమున్న కథలు

చిన్నప్పుడు మా అమ్మమ్మలూ, పెద్దమ్మలూ, చిన్నమ్మలూ - యింకా మావయ్యలూ, అన్నయ్యలూ - యింకా బావలూ, వదినలూ, స్నేహితులూ - అందరూ, వయసులో నాకన్నా పెద్దవాళ్లే! వీళ్లందరూ నాకూ, మా కుటుంబంలో నా వయసున్న యింకా బోల్డెంతమందికీ ఎన్నో కథలు, రకరకాలవి, చెప్పేవాళ్లు. రాజుల కథలూ, వీరుల కథలూ, భక్తి కథలూ, దేవుళ్ల కథలూ - యిలా ఎన్నో రకాల కథలు. అవన్ని అద్భుతంగా వుండేవి. ఎంతో ఆనందాన్నిచ్చేవి. ఉత్సాహాన్నిచ్చేవి. పైగా వాటి వల్ల ఎంతో హాయిగా నిద్ర పట్టేది. సూర్యుడు నడినెత్తి కెక్కేవరకూ నిద్రలోనే వుండే వాళ్ళం. నిద్ర లేచాక మళ్ళీ ఎప్పుడెప్పుడు రాత్రవుతుందా, ఎప్పుడు అన్నాలు తినేసి కథలకు్కూచుందామాని తెగ ఆత్రంగా వుండేది. అలా బాల్యం గడిచింది. వయసుతోపాటు జీవితం పెరిగింది. బుద్ధీ పెరిగింది, అనుభవమూ పెరిగింది. కథల్లా జీవితంలో కూడా హెచ్చు తగ్గులూ, సుఖదుఃఖాలూ, ఆటుపోట్లూ ఉన్నాయి. అంతే జీవితం! నాదే కాదు అందరి జీవితాలూ - కథల్లాగే ఉంటాయని తెలిసింది -

అసలు జీవితానుభవాల్లోంచే కథలు చెప్తారని ఒక వయసు వచ్చాక జ్ఞానోదయం అయ్యింది. 'ఓహో - ఇవా కథలంటే!' అని కూడా జడ్జిమెంట్ దొరికింది. అందువలన చేత నూటొక్క జిల్లాల నిజమేమిటంటే - కథలు విధిగా జీవితాల్లోంచే పుడతాయనీ, జీవితాల్నే ప్రతిబింబించాలనీను!

అయితే కొన్ని కథలు కేవలం కాలక్షేపం కోసం కూడా వుంటాయి. వాటి చరిత్ర మనకనవసరం.

రచయిత మందపాటి సత్యం గారు నాకు గత ముప్పై యేళ్లుగా పరిచయం. వ్యక్తిగా ఏడాదిగా తెలుసు. ఆయన చాలామంది లాగే మధ్యతరగతి మనిషి. సామాన్యమైన మనిషి. కానయితే జీవితాన్నీ, మనుషుల్నీ ప్రేమించే మనసున్న మనిషి. తోటి మనుషుల కష్టసుఖాల్ని ప్రేమించారు.

అందువల్లే ఆయన ఈ కథల్ని రాశారు.

ఈయన కథల్లో మెరుపుల్లేవు, నిజాలు తప్ప! అలంకారాలు లేవు, నిరాడంబరత తప్ప!

ఈయన కథల్లో నాక్కనిపించిన మరో మంచి గుణం - కథని ఎంతో నింపాదిగా, సజావుగా చెప్పటం! ఎంత చెప్పాలో అంతే చెప్పటం ! పైగా - రచయితగా జోక్యం చేసుకుని తానేదో పేద్ద జ్ఞాని అయినట్టు పాఠకుడికి హితబోధలు చేయకపోవటం!!

అయ్యా - సత్యంగారూ, మీ సింప్లిసిటీకి నమస్కారం!

అసలు సంగతి - సత్యంగారూ - ఈ సంపుటిలోని కథల్ని నిజంగా క్షుణ్ణంగా చదివాను. చదివాక మీ కథల్ని 'పరిచయం చేసే' అవకాశాన్ని బ్రహ్మాండంగా వాడుకుని, నాకు తెలుగు కథతో వున్న నలభై ఏళ్ల అనుభవంతో కలిగిన జ్ఞానసంపదని ప్రదర్శిద్దామనుకున్నాను. ప్రదర్శించి, ఒక్కో కథ తాలూకు ఒడ్డు పొడువునీ, రంగూ రుచినీ, తప్పొప్పుల్నీ విశదీకరించి పాఠకమహాశయులకి తెలియజెప్పే ప్రయత్నం చేద్దామనుకున్నాను. ఎందుచేతనో (బహుశా నా మనసు మారుమూలెక్కడో 'ఇంగితం' అన్న పదార్థం వున్నందువల్ల గాబోలు) ఆ ప్రయత్నం విరమించుకోవటం నా ఆరోగ్యానికి అన్ని రకాలుగా 'ఆరోగ్యం' అని స్ఫురించింది. అందువల్ల -

మీ గురించీ, మీ కథల గురించి ఇలా మీలాగా సింపుల్‌గా రాయటమే నాకు అన్ని విధాలా క్షేమమని భావించి -

మీ నుంచి మరిన్ని కథల్ని ఆశిస్తూ -

మీ
చంద్ర

29 మే 2000
హైదరాబాదు